క్లుప్తంగా

పరీక్షా కేంద్రాల తనిఖీ

పెద్దమండ్యం : పదోతరగతి పరీక్షా కేంద్రాలను డీఈఓ యు. శివప్రకాష్‌రెడ్డి, డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం శనివారం పరిశీలించారు. మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దమండ్యం పరీక్షా కేంద్రాన్ని డీఈవో, కలిచెర్ల పరీక్షా కేంద్రాన్ని డివైఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటలర్‌లతో వారు మాట్లాడారు. పరీక్షల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జాకీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లో 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ని 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మార్పు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, విద్యుత్‌శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణవేణి

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థులు జాయినింగ్ డాట్స్ సంస్థ నిర్వహించిన వెబ్‌సైట్ డిజైన్ పోటీల్లో ప్రతిభను కనబరిచారు. కాలేజీకి చెందిన విద్యార్థులు అనిత, మాహీర్, రిహానా స్మార్ట్ ఇంటర్న్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాది వెబ్‌సైట్ డిజైన్ పోటీల్లో హాకతాన్ విన్నర్స్‌గా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. వీరిని శనివారం కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణవేణి, ఇంటర్న్ షిప్ మెంటర్ సూర్యశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ శ్రీనివాసులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురేద్దాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు

వాల్మీకిపురం : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరేద్దామని కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు అన్నారు. శనివారం మండలంలోని జర్రావారిపల్లిలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత 58 నెలల కాలంలో రాష్ట్రంలో 99శాతం సంక్షేమ పథకాలను అమలు చేసి, పేదలకు లబ్ధి చేకూర్చారన్నారు. భూటకపు హామీలతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ కలిసి వస్తున్నారన్నారు. మీ ఇంట మంచి జరిగింటే ఓటేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంటున్నారన్నారు. జగన్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక చంద్రబాబు ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో చలపతి, విశ్వనాథ్, క్రిష్టారెడ్డి, సుధాకర, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరస్వామికి మహా తైలాభిషేకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధ అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం శ్రీ శనేశ్వర స్వామికి మహా తైలాభిషేకం నిర్వహించారు. షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో శాస్త్రోక్తంగా శని మహాత్మునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అభిరాం స్వామి, రాజు స్వామి, దినేష్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి లోబడి ముదివేడు జాతర


మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కురబలకోట : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమావళికి లోబడి ఈనెల 30న రాత్రి జరిగే ముదివేడు దండుమారెమ్మ జాతర నిర్వహించాలని ముదివేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి సూచించారు. శనివారం ఆయన జాతర నిర్వాహకులు, చాందినీ బండ్లు కట్టే వారితో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలన్నారు. రికార్డింగ్ డ్యాన్సులు నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద మరింత నిఘా



కర్ణాటక సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్


చీకలబైలు చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీ

- రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతివాహనాన్ని తనిఖీచేయాలి
- మద్యం, డబ్బు, నిషేధిత వస్తువులు అక్రమరవాణా నిరోధించాలి
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మదనపల్లె నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ తెలిపారు. మదనపల్లె మండలం చీకలబైలు వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను, పోలీసుల తనిఖీ కేంద్రాలను శనివారం ఆర్వో హరిప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నియమావళిని అనుసరించి వాహన రవాణాపై నిఘా ఉంచాలని, అధిక నగదుతో పాటు ఇతర నిషేధిత వస్తువులు వాహనాల్లో ఉంటే వెంటనే అదుపులోకి తీసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని, పోలీస్ కేసులు నమోదుచేయాలన్నారు. ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలన్నారు. అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసులతో పాటు రవాణా, ఎక్సైజ్, అటవీ, వాణిజ్యపన్నులశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. 24 గంటలు అప్రమత్తతతో వీడియోగ్రఫీ నిర్వహిస్తూ వాహనాలను తనిఖీ చేయాలని, రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉన్నప్పుడు సరైన పత్రాలు లేకుండా ఉంటే వాటిని సీజ్‌చేయాలని సిబ్బందికి సూచించారు. కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువులు అక్రమరవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెక్‌పోస్ట్ తనిఖీలో ఆర్వో హరిప్రసాద్‌తో పాటుగా తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభివృద్ధి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పీలేరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె, కురవపల్లె, గాయంవారిపల్లె, హరిజనవాడ, మొటుకుపల్లె, నగిరి తదితర గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గూర్చి వివరించి ఓట్లు అభ్యర్థించారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని వరుసగా మూడోసారి గెలిపించి రాష్ట్రానికి జగనన్నను రెండో సారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంగల్‌రాయుడు, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, నాయకులు భవనం వెంకటరమణారెడ్డి, కడప గిరిధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వి.పి. రమేష్‌రెడ్డి, గాయం భాస్కర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, యర్రమరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, దేవరాజులు, సూరి, వెంకటరమణనాయుడు, ఎన్.వి. చలపతి, నరసయ్య, సురేంద్ర, టి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో అధిక ప్రయోజనాలు

పెద్దతిప్పసముద్రం : గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే అధిక ప్రయోజనాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ అన్నారు. శనివారం ఆమె మండలంలోని బూర్లపల్లి సెక్టార్ పరిధిలోని ఉప్పరవాండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారని హితబోధ చేశారు. అనంతరం చిరు ధాన్యాలు, పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

బాలి నాయన పల్లెలో కార్డెన్ సెర్చ్

నిమ్మనపల్లె : మండలంలోని వెంగం వారి పల్లె పంచాయతీ బాలనాయినిపల్లెలో శనివారం పోలీస్ సిబ్బంది, ఎస్ఎస్‌బి ఫోర్స్‌తో కలిసి ఎస్ఐ లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై లోకేష్ రెడ్డి మాట్లాడుతూ విస్తృత తనిఖీలలో భాగంగా నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 700 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. బాలినాయనపల్లె కి చెందిన బాలే సురేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు నూతన టెక్నాలజీ ఉపయోగించుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం పుంగనూరు రోడ్డులోని కాలేజీలో జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం రెండో రోజు జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మరెన్నో విజయవంతమైన ప్రాజెక్టులను తయారు చేయాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు తయారు చేయాలని తెలిపారు. విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రామసముద్రం : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ సర్కిల్, చెక్‌పోస్ట్ వరకు ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ లీలా మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలన కోసం వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేయాలన్నారు. వ్యాధి లక్షణాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీగట్టు వెంకటేశ్వరుడు


హనుమంత వాహనంపై విహరిస్తున్న స్వామివారు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు హనుంత వాహనంపై రామావతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాన్ని 9వ పనకట్టు వారు, వాల్మీకులు అత్యంత ఘనంగా జరిపించడం ఆనవాయితీ. స్వామివారిని ఆలయ అర్చకులు, కార్యనిర్వాహకులు ప్రత్యేకంగా పూలు, విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. కోలాటం, చెక్క భజనలతో నయం డిడ్యాన్స్‌లతో, బాణసంచాల నడుమ ఘనంగా పురవీధులలో ఊరేగించారు. ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలతో పాటు కర్ణాటక ప్రజలు తరలివచ్చారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి


తలపులలో కేంద్రబలగాలు, పోలీసుల కవాతు



ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ

పీలేరు రూరల్ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తలపుల, రెడ్డివారిపల్లె, జాండ్ల గ్రామాల్లో కేంద్ర సాయుధ బలకాలు, పోలీస్ సిబ్బందిచే కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగ కుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

పీలేరు : ట్రాన్స్‌జెండర్స్ ఓటుహక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ఎస్. రమా అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టణంలో వ్యవస్థీకృత ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కోరారు.

రూ.44.50 లక్షల పన్ను వసూలు

– నేడు, రేపు ప్రత్యేక కౌంటర్

బి.కొత్తకోట : ఇంటి పన్నుల బకాయిలపై ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించడంతో బి. కొత్తకోట నగర పంచాయతీలో పన్నుల వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయని కమిషనర్ పి ఆర్.మనోహర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీలో పెండింగ్, ప్రస్తుత బకాయి రూ.2.11 కోట్లు ఉన్నట్టు చెప్పారు. ఇందులో ఈనెల ఒకటి నుంచి ఇప్పటివరకు రూ.44,50,732 వసూలైందని తెలిపారు. ఇందులో రూ.4,52,428 ఆన్‌లైన్‌లో ప్రజలు జమ చేశారని తెలిపారు. వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. ఆది, సోమవారాలు సెలవు రోజులైనప్పటికీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు పన్నులపై వడ్డీ మినహాయించుకుని చెల్లించాలని కోరారు.

భగత్‌సింగ్ యువతకు ఆదర్శప్రాయుడు


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ యువతకు ఆదర్శప్రాయుడని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ అన్నారు. శనివారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. భగత్‌సింగ్ విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయక ఉద్యమకారుడిగా నిలిచారన్నారు. నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఐదు కోట్ల విద్యార్థుల చేత సంతకాల సేకరణ చేపట్టి కేంద్రంలో ఉన్న బీజేపీని తరిమికొట్టి విద్యాకాషాయికరణకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, జస్వంత్, సర్దార్ , కిషోర్, కుమార్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ బీటీ కాలేజీలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆనందరెడ్డి మాట్లాడుతూ ఆయన ఆశయాలు, ఆలోచనలు, ఆవేశం ఎంతో మంది యువతలో స్ఫూర్తి నింపిందన్నారు. రాఘవరెడ్డి, శ్రీదేవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ములకలచెరువు : స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. యు వత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అంజనప్ప, ఆనంద్, సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

వాల్మీకిపురం : యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని జేవీవీ అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. శనివారం స్థానిక తరిగొండ రోడ్డులోని ఉర్దూ మైనార్టీ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ నవమల్లిక, ఉపాధ్యాయులు సోఫియా బేగం, అరుణ కుమారి, గీతాంజలి, జయప్రకాష్ రెడ్డి, షఫీ పాల్గొన్నారు.

సారాబట్టీలు ధ్వంసం

- 30 లీటర్ల సారా స్వాధీనం
- 200 లీటర్ల ఊట ధ్వంసం


జీవన్‌తోపు వద్ద నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుర్రంకొండ : నాటుసారా బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించి 200 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. కాగా ఓ నాటుసారా విక్రేతను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. గుర్రంకొండ పంచాయతీ జీవన్‌తోపు దగ్గర నాటుసారా బట్టీలు ఉన్నాయన్న సమాచారం అందుకొన్న ఎస్ఐ నాగార్జున రెడ్డి శనివారం తమ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. జీవన్‌తోపు దగ్గరున్న సమీప పొలాల్లో పెద్ద ఎత్తున నాటుసారా బట్టీలు ఉన్న విషయం గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. అక్కడే ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 200 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. అక్కడే నాటుసారా కాస్తున్న విజయలక్ష్మి (35) అనే మహిళను అదుపులోకి తీసుకొన్నారు. ఆమె వద్ద నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నామని ఎస్ఐ పేర్కొన్నారు. నాటుసారా విక్రేతపై కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన పేర్కొన్నాడు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం : స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమామంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి గానూ జూనియర్ కళాశాలలో చేరేందుకు మార్చి 2024లో పదవ తరగతి రాసిన వారు మాత్రమే అర్హులన్నారు. మైనార్టీ విద్యార్థులు 01.05.2024 నుంచి నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ నెల 31వ తేదిలోపు http://a prr.apcfrr.in ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9390614106ను సంప్రదించాలని ఆమె కోరారు.

గురుకుల పాఠశాలలో..

గుర్రంకొండ : ఏపీ గురుకులబాలికల పాఠశాలల్లో విద్యార్థినులు చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల బాలిక పాఠశాల ప్రిన్సిపల్ సాయి శిరిష కోరారు. ఐదవ తరగతిలో 40 సీట్లు, ఆరు, ఏడు, ఎనిమిదవ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెలాఖరులతోగా దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. దరఖాస్తు చేసుకొన్నవారికి ఏప్రిల్ 25 తేదిన ప్రవేశ పరిక్షలు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మోడల్ స్కూల్లో..

పెద్దతిప్పసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌లో 2024–2025 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నారాయణ, ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి త్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 22 లోపు ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీనారసింహుడు


సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి సూర్యప్రభ వాహనంపై విహరించారు. స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామునే మూలవర్లకు శుద్ధి తోమాల సేవ, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారి వాహన మండపంలో రంగురంగుల పుష్పాలతో అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామివారిని కొలువు దీర్చారు. మేళతాళాలతో భాజాభజంత్రీలతో గ్రామపురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు సాగింది. మధ్యాహ్నం మండపంలో మూలవర్లకు ఊంజల్‌సేవ నిర్వహించారు. సాయంకాలం అందంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై స్వామివారు కొలువు దీరి గ్రామ పురవీధుల గుండా విహరించారు. అనంతరం స్వామివారికి పార్వేట ఉత్సవం, దోపు తిరునాల వైభవంగా నిర్వహించారు. టీటీడీ కళాకారుల కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఆలయఅర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యునాని వైద్యులు ఖాదరి

వాల్మీకిపురం : పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని చింతపర్తి యునాని వైద్యులు ఖాదరి అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మెరుగైన ఆరోగ్యంపై అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం పక్వాడా పథకం ముఖ్య లక్ష్యమన్నారు. పిల్లలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, ఆహారంలో ప్రతి రోజు పప్పు దినుసులు, కోడిగుడ్లు ఉండేలా చూడాలని, మూత్ర విసర్జన తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రిజ్వానా బేగం, వైద్య సిబ్బంది శివయ్య, తదితరులు పాల్గొన్నారు.